సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025



సిల్క్ సిటీలో దొంగలు పడ్డారు!

దొంగల కన్ను సిల్క్ సిటీపై పడింది. ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా చోరీలతో చెలరేగిపోతున్నారు. 8లో



కొలిస్తే 'చింతల'న్నీ దూరం

తాడిపత్రిలో ఈ నెల 30 నుంచి చింతల వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం
33.6°/ 20.8°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి నుంచి పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పెనుకొండ పోలీసులు

పుట్టపర్తి టౌన్: నేరస్తులు, రౌడీషీటర్లు పాత పద్ధతిని మాని సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. జిల్లాలో మైనర్ బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, కిడ్నాప్‌లు, హత్యలు, చోరీలు తదితర నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే అమ్మాయిలను వెంటపడి వేధించడం వారికి ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

- ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం అన్ని సబ్ డివిజన్లలో పాత నేరస్తులతోపాటు 185 మంది రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి.. హెచ్చరికలు జారీ చేశారు. ఇక నుంచి నేరాలకు స్వస్తి పలికి మంచిగా జీవించాలని సూచించారు.

కుస్తీ విజేత 'అనంత'

- ద్వితీయస్థానంలో చిత్తూరు, తృతీయ స్థానంలో శ్రీసత్యసాయి జిల్లాలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న డీఎస్పీ మహేష్, తదితరులు

హిందూపురం టౌన్: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల విజేతగా అనంతపురం నిలిచింది. ద్వితీయ స్థానంలో తిరుపతి, తృతీయ స్థానంలో శ్రీసత్య సాయి జిల్లా నిలిచాయి. హిందూపురంలో రెండురోజులుగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ 5వ రాష్ట్రస్థాయి కుస్తీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. అన్ని జిల్లాల నుంచి 106 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 36 కేటగిరీల్లో పోటీలు జరిగాయి. ఇందులో 36 మంది విజేతలుగా నిలిచారు. వీరు నవంబర్ ఒకటో తేదీ నుంచి అయోధ్యలో నిర్వహించే జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొననున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిత

కుస్తీ చాంపియన్‌షిప్ పోటీల ముగింపు వేడుకలు రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో జరిగాయి. హిందూపురం డీఎస్పీ మహేష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు గోల్డ్‌మెడల్, ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరచిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు. జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించాలని ఈ సందర్భంగా ఆయన విజేతలకు సూచించారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, సాయి సుమతి, సాయి లత, సురేందర్‌రెడ్డి, పూలకుంట సర్పంచ్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'



ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. పీజీఆర్ఎస్ మందిరంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలన్నారు. అర్జీలు పరిష్కారం కాని వారు 1100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కలెక్టరేట్‌కు రాకుండా meekosam.ap.gov.in ద్వారా కూడా సమర్పించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీస్ కార్యాలయంలో...

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ సతీష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా తెలుపుకోవచ్చునని సూచించారు.

- గత నెలలో అనంతపురం రూరల్ మండలానికి చెందిన 30 ఏళ్ల యువకుడు గుండె నొప్పిగా ఉందంటూ అనంతపురంలోని సర్వజనాస్పత్రికి వచ్చాడు. వైద్యులు పరీక్షిస్తున్న సమయంలోనే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు.
- అనంతపురం నగరపాలక సంస్థలో పని చేసే ఓ ఉద్యోగి ఇటీవల అమరావతికి వెళ్లారు. మార్గ మధ్యంలో ఉన్నఫళంగా గుండె నొప్పి వచ్చింది. తోటి సిబ్బంది హుటాహుటిన కర్నూలు జిల్లాలోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. వీరిద్దరే కాదు.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇటీవల యువతలో గుండెపోట్లు పెరిగిపోయాయి.



బీ'ట్' కేర్ ఫుల్

- యువతలో అధికమైన గుండె సమస్యలు
- ఆహార అలవాట్లు, వ్యసనాలతోనే సమస్యలంటున్న వైద్య నిపుణులు
- మెరుగైన జీవన విధానంపై దృష్టి సారించాలని సూచనలు

అనంతపురం మెడికల్: నిండు నూరేళ్లు జీవించాలని పెద్దలు ఆశీర్వదిస్తుంటారు. వందేళ్లు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆనందంగా జీవనం సాగించాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ ప్రస్తుత రోజుల్లో వందేళ్ల మాట పక్కన పెడితే 25 నుంచి 30 ఏళ్లకే యువత మరణిస్తుండడం కలచివేస్తోంది. ప్రధానంగా గుండె సంబంధిత సమస్యలతో ప్రాణాలో కోల్పోతుండడం కలవరపరుస్తోంది. చెట్టంత కొడుకు కళ్లముందే ప్రాణాలు విడుస్తుండడంతో తల్లిదండ్రులకు తీరని శోకం మిగులుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా సగటున 25 వేల మందికిపైగా గుండెపోట్లకు గురవుతుండడం గమనార్హం. 2019-20లో 4,660, 2020-21లో 5,107, 2021-22లో 6,637, 2022-23లో 7,909, 2023-24లో 10,274, 2024-25లో 9,754, 2025లో 7 వేల వరకు (ఇప్పటి వరకు) గుండె సంబంధిత శస్త్రచికిత్సలు జరిగాయి. ఏటా ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం (ఆరోగ్య శ్రీ)లో భాగంగా 30 శాతానికి పైగా గుండె జబ్బులకే వ్యయమవుతోంది. రూ.25 కోట్లకు పైగానే ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

జాగ్రత్తలు తప్పనిసరి..

విద్యార్థి దశ నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా రోజూ కనీసం అరగంట వాకింగ్, వ్యాయామం చేయాలంటున్నారు. ఆహారంపై కూడా శ్రద్ధ వహించాలని చెబుతున్నారు. జంక్ ఫుడ్‌తో ఓబెసిటీ, గ్యాస్ట్రైటీస్ తదితర సమస్యలు తలెత్తుతాయంటున్నారు. వారానికి 150 నిమిషాలు కనీస నడక మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే, 40 ఏళ్లు పైబడిన వారు తప్పకుండా బీపీ, కొలెస్ట్రాల్, షుగర్, టెస్టులు చేయించుకుని మందులు వాడితే గుండెపోటును నియంత్రించవచ్చంటున్నారు.



వ్యసనాలతోనే సమస్య..

వ్యసనాలకు బానిసలు కావడం, వ్యాయామం, యోగా తదితర వాటికి దూరంగా ఉండడం తదితర కారణాలతో చిన్నవయసులోనే గుండె సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత రోజుల్లో యువత పార్టీల పేరుతో ఇష్టానుసారంగా మద్యం తీసుకుంటున్నారు. అత్యంత ప్రమాదకరమైన ధూమపానాన్ని సేవిస్తున్నారు. దీనికి తోడు ఉరుకుల పరుగుల జీవితంలో బిజీగా ఉంటూ మానసిక ఒత్తిడికి లోనవుతూ హైపర్‌టెన్షన్, మధుమేహం బారిన పడుతున్నారు.

యోగాతో సత్ఫలితాలు



ప్రస్తుత పోటీ ప్రపంచంలో మంచి ఆహార అలవాట్లు లేకపోవడం, శారీరక శ్రమ చేయకపోవడం, నిద్రలేమి తదితర కారణాలతో తీవ్రమైన మానసిక ఒత్తిళ్లకు లోనవుతున్నారు. గుండె పోటు, బీపీ, మధుమేహం తదితర సమస్యలు తెచ్చుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ విధిగా వ్యాయామం చేయాలి. యోగా బాగా ఉపయోగపడుతుంది. నిత్యం యోగా చేస్తే సత్ఫలితాలు పొందవచ్చు.

– సురేష్ ఈశాపతి, యోగా గురువు, అనంతపురం

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



జంక్ ఫుడ్, పొగ తాగడం, వ్యాయామం లేకపోవడంతో యువత మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. వారంలో కనీసం ఐదు రోజుల పాటు వ్యాయామం చేయాలి. వంశపారంపర్యంగా కూడా గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత రోజుల్లో 12 మందిని పరీక్షిస్తే అందులో ముగ్గురికి కచ్చితంగా బీపీ సమస్య కన్పిస్తోంది. ఈ పరిస్థితుల్లో 40 ఏళ్లు దాటిన వారందరూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

– సుభాష్ చంద్రబోస్, అసోసియేట్ ప్రొఫెసర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

'ధన'లక్ష్మీ నమోస్తుతే



నవరాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. ఏడో రోజైన ఆదివారం జగన్మాత వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాయదుర్గంలోని కోటలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని రూ. కోటి విలువైన కరెన్సీ నోట్లు, కాయిన్లతో అలంకరించడం విశేషంగా ఆకట్టుకుంది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తాయి రాజశేఖర్, యువజన సంఘం అధ్యక్షుడు వంశీకృష్ణ, ప్రధాన అర్చకులు వెంకటాచలశర్మ అలంకరణలో పాలుపంచుకోగా, భారీ సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

– రాయదుర్గంటౌన్:

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం అర్బన్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా ఫ్రెండ్స్ షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు తనవంతు ప్రోత్సాహం అందిస్తానని తెలిపారు. విదేశీ వస్తువుల వాడకం తగ్గించి స్వదేశీ వస్తువుల వినియోగం పెంచాలని సూచించారు. అనంతరం అందరితోనూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం షటిల్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన డాక్టర్ మదన్‌మోహన్, ఆదినారాయణను మంత్రి సన్మానించి ట్రోఫీ అందించారు. ద్వితీయ బహుమతి సాధించిన క్రీడాకారులు విజయ్, గుణకు రూ.7వేల నగదు, ట్రోఫీ, తృతీయ బహుమతి సాధించిన పురుషోత్తం, చైతన్యలకు రూ.5వేల నగదు, ట్రోఫీ, నాలుగో బహుమతి సాధించిన జోలా రాజారెడ్డి, నరేంద్రకు రూ.3వేల నగదు, ట్రోఫీలను అందజేశారు. షటిల్ టోర్నీ అంపైర్లుగా యంబా రాము, కృష్ణమోహన్ వ్యవహరించారు. క్రీడాకారులకు ఉదయం అల్పాహారాన్ని ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు పెనుబోలు శంకర్ అందించారు. కార్యక్రమంలో ప్రైవేటు కళాశాల కరస్పాండెంట్ సీతారామయ్య, ఆర్టీసీ ముత్యాలప్ప, బ్రహ్మానందరెడ్డి, భగవంత్‌రెడ్డి, కిరణ్, ఫ్రెండ్స్ షటిల్ టోర్నమెంట్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'పల్లె'పై 'తమ్ముళ్ల' ఫైర్!



- కాంట్రాక్ట్ పనులన్నీ స్థానికేతరులకే
- లబోదిబోమంటున్న స్థానిక నాయకులు

పుట్టపర్తి అర్బన్: పార్టీ కోసం కష్టపడిన తమను కాదని స్థానికేతరులకు కాంట్రాక్ట్ పనులు కట్టబెడుతున్నారని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డిపై తెలుగు తమ్ముళ్లు అసంతృప్తితో రగిలిపోతున్నారు. అభివృద్ధి పనులన్నీ టెండర్ ద్వారా ఇతర ప్రాంతాల కాంట్రాక్టర్లకు అప్పగించి కమీషన్లు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిపాటు ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలూ జరగలేదు. గత ప్రభుత్వంలో మంజూరైన సిమెంటు రోడ్లను మాత్రమే పూర్తి చేయించారు. ప్రస్తుతం జిల్లా కేంద్రం పుట్టపర్తిలో మామిళ్లకుంట క్రాస్ వద్ద కలెక్టరేట్ గ్రీవెన్స్ కోసం ఒక భవనం సిద్ధం చేశారు. భవన నిర్మాణ పనులను ధర్మవరానికి చెందిన కాంట్రాక్టర్ రూ.85 లక్షలతో పూర్తి చేశారు. అసలు భవనం మంజూరు విషయం స్థానిక టీడీపీ నేతలకు తెలియలేదు. నిర్మాణ సమయంలో వివరాలు తెలుసుకుని ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిని నిలదీసినట్లు సమాచారం.

- ఇక మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో సిమెంటు రోడ్డుకు రూ.2 కోట్లు మంజూరైంది. దీన్ని అనంతపురానికి చెందిన కాంట్రాక్టర్ చేజిక్కించుకొని పనులు చేయిస్తున్నారు. నాసిరకంగా వేస్తున్నారని, పాత తారు రోడ్డు తొలగించకుండానే సిమెంటు రోడ్డు వేస్తున్నారని స్థానిక నాయకులు మాజీ మంత్రి చెవిన వేశారు. 'దాన్ని మీరేమీ పట్టించుకోకండి.. అధికారులు చూసుకుంటారు' అంటూ తేలిగ్గా తీసుకున్నారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఇదే కాంట్రాక్టర్ ఎనుములపల్లి మార్కెట్ వద్ద మరో రోడ్డు పని చేయబోతున్నారు.
- పుట్టపర్తిలో పర్యాటక అభివృద్ధిలో భాగంగా సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకొని జోయాలుక్కాస్ సంస్థ సహకారంతో చిత్రావతి నదిలో రూ.1.20 కోట్ల వ్యయంతో పార్కు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు స్థానిక ఎమ్మెల్యే సొంత రాష్ట్రం కేరళకు చెందిన కాంట్రాక్టర్ చేపట్టారు. కాంట్రాక్టర్ ప్రత్యక్షంగా ఉండలేక స్థానికులను నియమించి పనులు చేయిస్తున్నారు. దీన్ని ఇరిగేషన్ శాఖ పర్యవేక్షిస్తోంది.
- ఇదే చిత్రావతి నది వద్ద రూ.25 లక్షలతో స్నానపు ఘట్టం ఒకటి ఏర్పాటు చేశారు. ధర్మవరానికి చెందిన ఓ కాంట్రాక్టర్ ఈ పనులు పూర్తి చేశారు. ఇవన్నీ ఒకెత్తు అయితే త్వరలో జరగనున్న సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలకు సుమారు రూ.4 కోట్లు మంజూరు కానుంది. ఈ పనులకు సైతం ఇప్పటికే టెండర్‌కు వెళ్లాలని మాజీ మంత్రి సూచించినట్లు స్థానిక నాయకులు వాపోతున్నారు. ఇదే జరిగితే మనగతి ఏమి కావాలంటూ గుసగుసలాడుతున్నారు.



- హిందూపురం మండలం గొల్లాపురం సమీపంలో నాలుగేళ్ల చిన్నారిపై ఓ ఆకతాయి మద్యం మత్తులో అఘాయిత్యానికి పాల్పడి ఇసుకలో పాతిపెట్టిన ఘటన ఏడాది క్రితం వెలుగు చూసింది. హిందూపురం రూరల్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.
- రామగిరి మండలం పేరూరు పంచాయతీ ఏడుగుర్రాపల్లిలో దళిత మైనర్ బాలికపై కొందరు ఆకతాయిలు బెదిరింపులకు దిగుతూ అత్యాచారానికి పాల్పడ్డారు. ఘటన వెలుగు చూసిన అనంతరం 17 మందిపై కేసు నమోదైంది. పట్టుబడిన వారిలో ఒక మైనర్ ఉన్నాడు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలన సృష్టించింది.
- పుట్టపర్తి మండలం బత్తలపల్లిలో 9వ తరగతి చదువుతోన్న విద్యార్థినిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం మత్తులో బలత్కారం చేయబోయాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు గమనించి పోలసులకు సమాచారం ఇచ్చారు. విచారణ అనంతరం నిందితుడిపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది.

చిన్నారులకు రక్షణేదీ..?

జిల్లాలో పెరిగిపోతున్న వేధింపులు

- ఏడాదిన్నర వ్యవధిలో వంద పైగా పోక్సో కేసులు
- బయటకు రానీయకుండా ఆగిన ఘటనలు లెక్క లేనన్ని..
- మద్యం, గంజాయి మత్తులో నేరాలకు పాల్పడుతున్న వైనం

సాక్షి, పుట్టపర్తి: చిన్నారులకు రక్షణ కల్పించే దిశగా 2012లో ప్రవేశపెట్టిన పోక్సో చట్టం రాష్ట్రంలో సరిగా అమలు కావడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో చిన్నారులపై లైంగిక వేధింపులు పెరిగిపోయాయి. మద్యం, గంజాయి మత్తులో ఆకతాయిలు వయసుతో సంబంధం లేకుండా వేధింపులకు పాల్పడుతున్నారు. ఏడాదిన్నర వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 126 పోక్సో కేసులు తేలడం ఆందోళన కలిగిస్తోంది. ఇంకో వంద పైగా ఘటనలు దుప్పటి పంచాయితీలతోనే ముగించినట్లు సమాచారం. మహిళలకు రక్షణ లేదు.. చిన్నారులపై వేధింపులు ఆగలేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు దాటినా.. ఇప్పటికీ మహిళ ఒంటరిగా బయట తిరగలేని పరిస్థితి నెలకొంది. అల్లరిమూకల చేష్టలకు ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారు. పోక్సో కేసుల సంగతి పక్కన బెడితే.. లెక్కలేనని లైంగిక వేధింపుల కేసులు నమోదయ్యాయి. జిల్లాలో రోజుకో చోట లైంగిక వేధింపుల ఘటన వెలుగు చూస్తోంది. అవగాహన రాహిత్యంతో వేధింపులకు పాల్పడుతున్న వారి కంటే మద్యం మత్తులో అఘాయిత్యాలు చేస్తున్న వారే అధికంగా ఉండటం గమనార్హం.

నిందితుల్లో మైనర్లే అధికం

పోక్సో కేసుల్లోని నిందితుల్లో మైనర్‌లే అధికంగా ఉంటున్నారు. సామూహికంగా వేధింపులకు పాల్పడిన వారిలోనూ ఒకరిద్దరు మైనర్లు ఉంటున్నారు. దీంతో తెలియని వయసు వారి నుంచి వృద్ధుల వరకు పోక్సో చట్టం కింద కేసులు నమోదయ్యాయి. పుట్టపర్తి మండలంలో ఓ వృద్ధుడు, రామగిరి మండలంలో ఒక మైనర్ బాలుడు పోక్సో కేసులో నిందితులుగా ఉన్నారు. మద్యం, గంజాయి మత్తులో అత్యాచారాలకు పాల్పడుతూ జైలు పాలవుతున్నారు.

ఏడాదిన్నరలోనే ఎక్కువగా..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయి. నూతన మద్యం పాలసీ తీసుకొచ్చాక వీధివీధినా బెల్టు షాపులు వెలిశాయి. ఫలితంగా రాత్రింబవళ్లు గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. దీంతో మద్యం మత్తులో అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. 2024 జూన్‌లో – 5, జూలై – 11, ఆగస్టు – 1, సెప్టెంబరు – 10, అక్టోబరు – 5, నవంబరు – 5, డిసెంబరు – 5, 2025లో జనవరి – 8, ఫిబ్రవరి – 13, మార్చి – 9, ఏప్రిల్ – 19, మే – 9, జూన్ – 7, జూలై – 7, ఆగస్టు – 6, సెప్టెంబరులో ఇప్పటి వరకు – 5 కలిపి మొత్తం 126 పోక్సో కేసులు నమోదైనట్లు పోలీస్ రికార్డులు చెబుతున్నాయి.

చెలరేగుతున్న మట్టి మాఫియా



పందులకుంటకు వెళ్లే దారిలోని కొండలో హిటాచీతో టిప్పర్లలోకి మట్టిని నింపుతున్న దృశ్యం

- కదిరి మండలంలో అక్రమార్కులకు అడ్డుకట్టేదీ?
- అనుమతి గోరంత.. తరలించేది కొండంత
- ఎవరైనా ప్రశ్నిస్తే 'అన్న' స్నేహితుడికని బుకాయింపు

కదిరి అర్బన్: అధికారపార్టీ అండచూసుకుని అనుమతికి మించి మట్టి తరలించేస్తున్నారు. ఎవరైనా అధికారులు ఆపి మట్టి ఎక్కడికని అడిగితే.. 'అన్న (ఎమ్మెల్యే) స్నేహితుడికని' మట్టి తరలించే 'తమ్ముళ్లు' ధీమాగా చెబుతున్నారు. కదిరి మండలంలో కొందరు అక్రమార్కులు మాఫియాగా ఏర్పడ్డారు. అనుమతి ఒకలా తీసుకుని.. కొండ, గుట్టల్లో మట్టి తవ్వకాలు మరోలా చేస్తూ అడ్డదిడ్డంగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇందుకు తాజాగా మట్టి తరలిస్తూ అధికారుల కంటపడిన ఘటనే నిదర్శనం. ఆదివారం పందులకుంటకు వెళ్లేదారిలోని గుట్టలో మట్టి తరలిస్తున్న వ్యక్తిని వీఆర్‌ఓ ఓబులేసు ప్రశ్నించాడు. అనుమతి, చలానా పత్రాలు చూపించాలని అడిగితే.. 50 టిప్పర్లకు అనుమతిస్తూ కదిరి రాయల్టీ ఇన్‌చార్జ్ పేరుతో కూడిన పత్రాన్ని సదరు వ్యక్తి చూపించాడు. అందులోనూ ఐదు టిప్పర్ల నంబర్లు మాత్రమే పొందుపరిచారు. అదికూడా తెల్ల కాగితంపై రాసిచ్చారు. కానీ వారు తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తే 300కు పైగా టిప్పర్ల మట్టి తరలించినట్లు తెలుస్తోంది. ఇలా మాఫియాలోని ఒక్కో వ్యక్తి రోజూ వందకు పైగా టిప్పర్ల మట్టిని కదిరి పట్టణ శివారులోని వెంచర్లకు తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్ మట్టి రూ.2వేల దాకా విక్రయిస్తున్నారు. రోజుకు వంద టిప్పర్లు లెక్కేస్తే ఒక్కొక్క వ్యక్తి రూ.2లక్షల మట్టిని అమ్ముకుంటున్నట్లు తెలుస్తోంది. కొండలు, గుట్టల్ని కొల్లగొడుతుంటే కదిరి మండల భౌగోళిక స్వరూపమే మారిపోతోంది.

తెలివిగా తరలింపు..

మట్టి మాఫియా తెలివిమీరిపోయింది. ప్రభుత్వ కార్యాలయాల పనివేళల్లో కాకుండా ఉదయం 9 గంటలలోపు, సాయంత్రం ఆరు తర్వాత తవ్వకాలు చేపట్టి.. మట్టి తరలించేస్తున్నారు. పందుల కుంటకు వెళ్లే దారి పక్కన గుట్టలో హిటాచీలు పెట్టి మట్టి తవ్వుతున్నారు. అక్కడినుంచి టిప్పర్లలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ముందు ఉన్న నూతన బైపాస్ రోడ్డు, కదిరి– అనంతపురం జాతీయరహదారి మీదుగా యర్రదొడ్డి పక్కన వెంచర్లకు తరలిస్తున్నారు. ఇంకా ప్రారంభం కాని బైపాస్ రోడ్డు.. రోజూ వందలాది టిప్పర్లు తిరుగుతుండటంతో దెబ్బతింటోంది.

చర్యలు తీసుకుంటాం

అక్రమంగా మట్టిని తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని పంపించి వాహనాలు సీజ్ చేయిస్తాం. అక్రమార్కులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు.

– మురళీకృష్ణ, తహసీల్దార్, కదిరి

క్లుప్తంగా

వేల్పుమడుగులో పట్టపగలే చోరీ



చోరీపై ఆరా తీస్తున్న పోలీసులు

బత్తలపల్లి: మండలంలోని వేల్పుమడుగులో పట్టపగలే చోరీ జరిగింది. బాధితులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన దేవరపల్లి చిన్న చిన్నారెడ్డి ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి శుక్రవారం ఆళ్లగడ్డ సమీపంలోని అహోబిలేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. శనివారం తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు తీసి ఉండడం గమనించి, లోపలకు వెళ్లి పరిశీలించారు. బీరువాను ధ్వంసం చేసి అందులోని మూడున్నర తులం బంగారు చైను, రెండు జతల కమ్మలతో పాటు రూ.5వేలు నగదును అపహరించినట్లుగా గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంను రంగంలో దించి ఆధారాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

- అనాథలైన కుమారులు



కుమారులతో సరస్వతి (ఫైల్)

ధర్మవరం అర్బన్: విద్యుత్ షాక్‌కు గురై ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని శాంతినగర్‌లో నివాసముంటున్న వేరంగుల రాజశేఖర్, సరస్వతి (35) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మూడేళ్ల క్రితం అనారోగ్యంతో రాజశేఖర్ మృతి చెందాడు. అప్పటి నుంచి కూలి పనులతో పిల్లలను సరస్వతి పోషించుకుంటోంది. దసరా పండుగ దగ్గర పడుతుండడంతో ఆదివారం ఇంటిని శుభ్రం చేసేందుకు సిద్ధమైన సరస్వతి విద్యుత్ మోటారును పక్కకు జరుపుతుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనతో ఇద్దరు కుమారులు అనాథలయ్యారు.

రాజస్తాన్ వాసి ఆత్మహత్య



మృతుడు దేవరామ్

రామగిరి: రాజస్తాన్‌కు చెందిన దేవరామ్ (28) రామగిరిలో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రామగిరి సమీపంలోని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)కు సంబంధించిన ప్లాంట్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో దేవరామ్‌తో పాటు మరికొందరు వలస కార్మికులు పనుల్లో పాలు పంచుకుంటున్నారు. అయితే మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న దేవరామ్.. శనివారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయాడు. సహచరలు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం ఉదయం పేరూరుకు వెళ్లే మార్గంలో కంప చెట్టుకు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న దేవరామ్‌ను స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


సిల్క్ సిటీలో దొంగలు పడ్డారు!

పట్టుచీరలకు ఖ్యాతి గాంచిన ధర్మవరం పట్టణంలో శాంతిభద్రతల అంశం ఆందోళనకు గురి చేస్తోంది. దొంగలు రెచ్చిపోతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేదు. నడిరోడ్డుపై పబ్లిక్‌లోనే యథేచ్ఛగా దోపిడీలకు పాల్పడుతున్నారు.

- ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా పెచ్చుమీరుతున్న చోరీలు
- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా వరుస దొంగతనాలు
- వారానికి రెండు, మూడు బైక్‌లు మాయం



ధర్మవరం పట్టణంలో చేనేత కార్మికుడు దేవాంగం సూర్యనారాయణ ఇంట్లో చోరీ చేసిన దృశ్యం



ధర్మవరం పట్టణ ముఖచిత్రం

ధర్మవరం: సిల్క్ సిటీగా పేరుగాంచిన ధర్మవరంలో వరుస చోరీలు ప్రజలతో పాటు వ్యాపారులనూ బెంబేలెత్తిస్తున్నాయి. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస చోరీలతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. బైక్ చోరీలకు అంతే లేకుండాపోతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా సగటున వారానికి రెండు, మూడు ద్విచక్ర వాహనాలను మాయం చేస్తున్నారు. ఈ నెల 17న ముదిగుబ్బలోని సాయినగర్‌లో నివాసముంటున్న యూసఫ్ ఇంట్లో పట్టపగలే చొరబడిన దొంగలు 8 తులాల బంగారాన్ని అపహరించారు. మరుసటి రోజు అదే మండలంలోని బూదలాంబ ఆలయంలో హుండీని ధ్వంసం చేసి భక్తుల కానుకలను ఎత్తుకెళ్లారు. ఈ నెల 24న ఎల్‌సీకే పురంలో చేనేత కార్మికుడు దేవాంగం సూర్యనారాయణ తన కుమారుడి ఉన్నత చదువుల కోసం ఇంట్లో దాచుకున్న రూ.10లక్షల నగదుతో పాటు బంగారు ఆభరణాలను దొంగలు అపహరించారు. మరుసటి రోజే ముదిగుబ్బలోని నాయీ బ్రాహ్మణ కాలనీలో నివాసముంటున్న రమణమ్మ ఇంట్లోకి చొరబడి 6 తులాల బంగారాన్ని అపహరించారు. ఇటీవల చోటు చేసుకున్న ఈ ఘటనలు వరుస చోరీల తీవ్రతకు అద్దం పడుతున్నాయి.

దర్యాప్తులో కనిపించని పురోగతి

ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తం చోటు చేసుకుంటున్న దొంగతనాల కేసుల దర్యాప్తులో పురోగతి కనిపించడం లేదు. ఫిర్యాదులపై పోలీసులు కేసుల నమోదు తప్ప ఇప్పటి వరకూ దొంగతనాలకు పాల్పడుతున్న వారి ఆట కట్టించలేకపోయారనే విమర్శలు వెల్లువెత్తాయి. గడచిన 6 నెలల కాలంలో ధర్మవరం పట్టణంలోని నయారా పెట్రోల్ బంక్ వద్ద ఉన్న పెణుజూరు సుబ్బరత్నమ్మ కాంప్లెక్స్‌లో ఒకేరోజు నాలుగు దుకాణాల్లో దుండగులు చొరబడి రూ.లక్ష నగదు, వస్తువులు ఎత్తుకెళ్లారు. దొంగల కదలికలు సీసీపుటేజీల్లో చాలా స్పష్టంగా ఉన్నాయి. అయినా నిందితులను గుర్తించి అరెస్ట్ చేయడంలో పోలీసులు విఫమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. అంతకు ముందు ప్రియాంక నగర్‌లో ఒకే రోజు ఓ రెవెన్యూ ఉద్యోగి, మరో ఆటోడ్రైవర్ ఇళ్లలోనూ ఇదే తరహాలో దుండగులు చొరబడి 10తులాల బంగారాన్ని అపహరించారు. ఈ కేసు దర్యాప్తులోనూ పోలీసులు ఎలాంటి పురోగతి సాధించలేకపోయారు.



ఎస్‌బీఐ కాలనీలో బైక్ చోరీ జరిగిన ప్రాంతంలో అనుమానితుడి సీసీపుటేజీ

దొంగల ఆటకట్టిస్తాం



చోరీల నివారణకు ధర్మవరం డివిజన్ వ్యాప్తంగా పక్కా ప్రణాళికను సిద్ధం చేశాం. ధర్మవరం నలు దిక్కులా 40కి పైగా అత్యాధునిక సీసీకెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. డ్రోన్ నిఘానూ అందుబాటులోకి తెస్తున్నాం. రోజూ పట్టణ శివారు ప్రాంతాలతో పాటు, జాతీయ రహదారుల చుట్టూ, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలలో పోలీసులతో గస్తీ ఏర్పాటు చేస్తున్నాం. త్వరలోనే దొంగల జాడ పసిగట్టి అరెస్ట్ చేస్తాం.

–హేమంత్‌కుమార్, డీఎస్పీ, ధర్మవరం

బైక్ దొంగలకు గుజరీ వ్యాపారుల బాసట?

ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా రోజూ ఎక్కడో ఓ చోట బైక్ చోరీలు జరుగుతూనే ఉన్నాయి. అయితే బైక్ దొంగలకు ధర్మవరంలోని గుజరీ వ్యాపారులు బాసటగా నిలుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బైక్ అపహరించగానే గుజరీ వ్యాపారుల వద్దకు తీసుకువెళ్లి ఏ పార్ట్‌కు ఆ పార్ట్ విడదీసి విక్రయిస్తున్నట్లుగా సమాచారం. దీంతో ధర్మవరంలోని గుజరీ వ్యాపారుల వద్దకు ద్విచక్ర వాహనాల విడి భాగాల కోసం ఉమ్మడి జిల్లా నుంచి వచ్చి వెళ్లే మెకానిక్‌ల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ఈ మొత్తం అక్రమాల వెనుక గాంధీనగర్‌లోని ఓ గుజరీ వ్యాపారి డాన్‌గా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

ఈజీ మనీ కోసమా?

ధర్మవరం నియోజకవర్గంలో వరుస చోరీల నేపథ్యంలో లోకల్‌గా ఉన్న వ్యక్తులు ఈజీమనీ కోసం దొంగతనాలకు పాల్పడుతున్నారా? లేక ఇతర రాష్ట్రాల నుంచి ముఠా గ్యాంగ్‌లు వచ్చాయా అన్నది తెలియాల్సి ఉంది. పట్టణంలో చోరీలు జరిగిన ప్రాంతాల్లో దొరికిన సీసీపుటేజీలను పరిశీలిస్తే అనుమానితులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారుగా తెలుస్తోంది. వీరు రాత్రివేళల్లో తాళం వేసిన ఇళ్లు, దేవాలయాలు టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. పక్కా ప్లాన్‌తో చోరీలకు తెగబడతుండటంతో పట్టణ ప్రజలతో పాటు వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు.



ధర్మవరం-పుట్టపర్తి ప్రధాన రహదారి దుకాణాల వద్ద సీసీపుటేజీలో నమోదైన దొంగల కదలికలు

గొర్రెలపైకి దూసుకెళ్లిన కారు

- 13 జీవాల మృతి



మృతి చెందిన జీవాలు

బత్తలపల్లి: స్థానిక జాతీయ రహదారిపై గంటాపురం క్రాస్ వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్న ప్రమాదంలో 13 గొర్రెలు మృతి చెందాయి. వివరాలు.. జీవాల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్న గంటాపురం గ్రామానికి చెందిన భూమే అప్పస్వామి.. ఆదివారం తన గొర్రెల మందను మేపునకు గ్రామ శివారులోని బీడు పొలానికి తోలుకెళ్లాడు. సాయంత్రం గంటాపురం క్రాస్ వద్ద జీవాలను జాతీయ రహదారి దాటిస్తుండగా అనంతపురం నుంచి కదిరి వైపుగా వెళుతున్న కారు దూసుకెళ్లింది. ప్రమాదంలో 13 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 12 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ తన కారును ఆపకుండా వేగంగా ముందుకెళ్లిపోయాడు. కారు నెంబర్ ప్లేట్ మాత్రం అక్కడే పడిపోయింది. ఆరు నెలలు క్రితం రూ.4లక్షలు అప్పులు చేసి జీవాలను కొనుగోలు చేసి మేపుతున్నట్లు బాధిత కాపరి తెలిపాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

టీడీపీ నాయకుల అరెస్ట్

కొత్తచెరువు: మండలంలోని తలమర్లకు చెందిన టీడీపీ నాయకులను అరెస్టు చేసినట్లు ఆదివారం కొత్తచెరువు సీఐ మారుతీశంకర్ తెలిపారు. గ్రామంలోని రంగారెడ్డి గారి బాలకృష్ణారెడ్డి శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో తన భార్యతో కలసి ఇంట్లో భోజనం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మారుతీరెడ్డి, రాకేష్, కిషోర్ ఇంట్లోకి చొరబడి గొడవ పడ్డారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు అదే రోజు కేసు నమోదు చేసిన పోలీసులు... దర్యాప్తు అనంతరం ఆదివారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

అత్తపై దాడి.. కేసు నమోదు

రొద్దం: మండలంలోని పి.రొప్పాల గ్రామంలో అత్తపై దాడిచేసిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర ఆదివారం తెలిపారు. అత్తతో రవి, నరసింహామూర్తి, అంజి గొడవ పడి, ఇంటి ఆవరణలో ప్రహరీ ధ్వంసం చేశారు. అనంతరం అత్తపై దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

• పరవశ భరితం..



సంగీత కచేరీ నిర్వహిస్తున్న అనంతపురం క్యాంపస్ విద్యార్థులు

ప్రశాంతి నిలయం: దసరా వేడుకలలో భాగంగా సత్యసాయి విద్యార్థులు శతనామార్చన పేరుతో నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను మైమరపించింది. ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో అనంతపురం క్యాంపస్ డీన్ ప్రొఫెసర్ రాణి ప్రసంగించారు. దసరా వేడుకల గొప్పతనాన్ని, సత్యసాయి ప్రేమతత్వాన్ని వివరించారు. అనంతరం అనంతపురం క్యాంపస్ విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు. సంగీత వాయిద్య పరికరాలను వాయిస్తూ నిర్వహించిన కచేరీ భక్తులను మంత్ర ముగ్ధులను చేసింది.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- 'ఆల్‌మేవా' ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు షెక్షావలి



మాట్లాడుతున్న షెక్షావలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు షెక్షావలి డిమాండ్ చేశారు. ఆల్‌మేవా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ వై.ఫకృద్దీన్ అధ్యక్షతన ఆదివారం అనంతపురంలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 16 నెలలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటి వరకూ 12వ పీఆర్సీ ఏర్పాటు చేయకపోవడం అన్యాయమన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలన్నారు. ఫకృద్దీన్ మాట్లాడుతూ.. అర్హత ఉన్న మైనార్టీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మైనార్టీ విద్యార్థులకు ప్రతి జిల్లా కేంద్రంలోనూ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి ఫారూక్ మహమ్మద్ మాట్లాడుతూ.. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతోందన్నారు. కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ, డీఏ అందని ద్రాక్షలా మారాయని వాపోయారు. సమావేశంలో ఆల్‌మేవా నాయకులు ఫరూఖ్, ఫకృద్దిన్, అన్వర్, రసూల్, అస్రఫ్‌అలి, దౌలా, రఫి, మహబూబ్‌బాషా, సర్దార్ పాల్గొన్నారు.

• నేత్రదానం



కళ్లను దానం చేస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: స్థానిక యాదవవీధికి చెందిన ఓబులేసు కుమారుడు చిన్నారి సాయి శనివారం రాత్రి స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రక్తబంధం ట్రస్ట్ సభ్యులు నేత్రదానంపై అవగాహన కల్పించడంతో కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్ ఆస్పత్రికి చేరుకుని చిన్నారి సాయి కంటి కార్నియా సేకరించారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు కన్నా వెంకటేష్, సెక్రటరీ చిప్పల చంద్రశేఖర్, పోలీసులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

పెనుకొండ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985–86 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారు ఆదివారం అదే పాఠశాల వేదికగా సందడి చేశారు. నాటి అల్లర్లను గుర్తు చేసుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా నాటి గురువులు తిప్పేస్వామి, ఆనందరావు మాట్లాడుతూ.. 40 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న వారందరూ నేటికీ తమ స్నేహాన్ని మరచిపోకుండా ఇలా కలవడం గొప్ప విషయమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు కమిటీగా ఏర్పడి పాఠశాల అభివృద్ధికి పేద విద్యార్థుల ప్రగతికి కృషి చేస్తామని ప్రకటించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు శేషఫణి, శ్రీనివాస్, విజయ్, బుట్టే రామాంజనేయులు, విక్రం, గిరి, మధు, మురళి, నాగరాజునాయక్, అరుణ, రమాదేవి, సరస్వతి, ప్రకాష్, రమణ తదితరులు నేతృత్వం వహించారు.

విద్యుత్ అంతరాయంపై నిరసన



సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

చెన్నేకొత్తపల్లి: విద్యుత్ సరఫరాలో రెండురోజులుగా అంతరాయం కలగడంతో హరియాన్‌చెరువు తదితర గ్రామాల రైతులు ఆదివారం సాయంత్రం చిన్నంపేట సబ్‌స్టేషన్‌కు చేరుకుని నిరసన తెలిపారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో పంటలకు నీరందక వాడిపోతున్నాయని తెలిపారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పంట సాగు చేస్తే ఇప్పుడు కరెంటు రూపంలో ఇబ్బందులు సృష్టించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఏఈ రామాంజనేయులు రైతులకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిన మాట వాస్తవమేనన్నారు. దీనికితోడు సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్ నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కూడా ఉందని, ఆపరేటర్‌ను మరోచోటుకు పంపుతున్నామన్నారు. తక్షణమే మోటార్లకు విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

కొలిస్తే చింతలన్నీ దూరం

- రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు
- 7న బ్రహ్మరథోత్సవం

భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న చింతల వేంకటరమణస్వామి



ఆలయంలోని లోపలి భాగం, (ఇన్‌సెట్) భూదేవి, శ్రీదేవి సమేత చింతల వేంకటరమణస్వామి ఉత్సవ విగ్రహాలు

తాడిపత్రి రూరల్: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న తాడిపత్రిలోని భూదేవి, శ్రీదేవి సమేత చింతల వేంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 30న ప్రారంభం కానున్నాయి. ఏటా ఆశ్వయుజ మాసం శుద్ధ అష్టమి నుంచి బహుళ విదియ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించే పనులు ఊపందుకున్నాయి.

బ్రహ్మోత్సవాలు ఇలా..

30న మంగళవారం సాయంత్రం విష్వక్సేనారాధన, మృత్సంగ్రహణం, అంకురార్పణ, అక్టోబరు 1న శేషవాహనం, 2న సింహవాహనం, మధ్యాహ్నం శమీ వృక్ష దర్శనం రాత్రి హంసవాహనం, 3న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 4న ఉదయం మోహినిదేవి అలంకరణ, రాత్రి గరుడ వాహనం, 5న ఉదయం తిరుచ్చిలో ఉత్సవం, సాయంత్రం హనుమద్ వాహనం, 6న ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం గజవాహనం, 7న ఉదయం తిరుకల్యాణం, మధ్యాహ్నం విందుభోజనాలు, మధ్యాహ్నం 2.45గంటలకు బ్రహ్మరథోత్సవం, 8న ఉదయం తిరుచ్చిలో ఉత్సవం, సాయంత్రం అశ్వవాహనం, 9న వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం ద్వాదశ ఆరాధన, రాత్రి ధ్వజా అవరోహణ, కుంభప్రోక్షణ, భట్టర్ మర్యాద నిర్వహించనున్నారు.

శిల్పకళతో అబ్బుర పరుస్తున్న ఆలయం..

భూదేవి, శ్రీదేవి సమేత చింతల వేంకటరమణస్వామి ఆలయంలో అరుదైన శిల్ప కళాసంపదను సొంతం చేసుకుంది. క్రీ.శ. 1490–1520 మధ్య కాలంలో విజయనగర సామ్రాజ్యంలో మండలాధీశునిగా పనిచేస్తున్న తిమ్మనాయుడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లుగా ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. శిల్ప కళా శోభితమైన మంటపాలు, మహాద్వార గోపురాలను అద్భుతంగా నిర్మించారు. ప్రధాన ద్వారం, గాలి గోపురం తూర్పు దశలో ఉన్నాయి. గాలిగోపురానికి ముందు రాతితో నిర్మించిన ఊయాల మంటపం, ఎత్తైన దీపపు స్తంభం ఉన్నాయి. హంపీలోని శిల్పకళకు దగ్గర పోలికతో ఉన్న ఈ ఆలయాన్ని వారణాశి నుంచి ప్రత్యేకంగా రప్పించిన శిల్పులతో నిర్మించినట్లుగా చరిత్రకారులు చెతున్నారు. ఆలయంలో ఏకశిలారథంతో పాటు రామాణ, మహాభారత, భాగవతం విశిష్టను చాటే శిల్పాలు అబ్బుర పరుస్తున్నాయి. కళ్యాణమంలపంలోని లో స్ధంభంలో మూడు దీపపు స్తంభాలను మీటితే సప్తస్వరాలు పలుకుతాయి. గర్భగుడిపై భాగంలో ఏర్పాటు చేసిన రాతిపద్మం నాటి శిల్ప కళానైపుణ్యానికి అద్దం పడుతోంది. మొత్తం 40 రాతి స్తంభాలతో మహా మంటపాన్ని ఏర్పాటు చేశారు. ఆలయంలోని విశాల ప్రాంగణంలో మహాలక్ష్మి అలయం, కల్యాణమంటపం, చెన్నకేశవ స్వామి ఆలయం, లక్ష్మీ సమేత వరాహస్వామి, ఆంజనేయ స్వామి, లక్ష్మీనారాయణ, రామాంజినేయ, రామానుజార్యుల ఉప అలయాలు ఉన్నాయి.



ఏకశిలా రథం